Saraswata Niketanam

# వారసులు



శ్రీ విశ్వనాథ కవిరాజు

నరసయ్యామ్మాగ్రహారంలో జగ్గన్న చెరువు. తూరుపు గట్టు మీద తలలు గొరిగించుకొని మున్ఫైయేడుగురు శ్రాద్ధకర్మ చేస్తున్నారు. తుడుము కొడుతూ చాటింపువాడు వస్తాడు.

చాటిం:—ఓహోయి ! యినండి ! యినండి ! సకలమైన వోళ్లకూ తెలియజేసేదేమంటే - నరసయ్యామ్మాగ్రరోరం కాపురస్తులూ- పప్పురైటర్లూ అయినటువంటి - లేట్ - గన్నవరపు శలమయ్యశాత్తుర్లువోరు- బద్దరాశలం- జాతరకెల్లీ- సక్కావత్తూ నడమ గోదారిలో - బోట్ పడవతో కూడా మునిగి పోనారు కాబట్టీ- ఆరికె తల్లీ తండ్రీ, అన్నా తమ్ముడూ, పిల్లా పిసికీ అవురూ లేరు కాబట్టీ - ఆరి యావదాస్తీకీ వోరసులనుకొనీ- ఆరికి యిక్కడ దినాలు సేత్తూన్నటువంటిన్నీ- తక్కినటువంటిన్నీ- సదరు వోరసులనుకొనే వోళ్లు అందరున్నూ- ఈరోజు సాయంకాలం 4 గంటలకి చరీగా 4 గంటలకి- రాదారి బంగాళా కాడికొత్తే- అక్కడికి సిన్న కలకటేరుగారు దయచేసి, వోళ్లవోళ్ల వక్జీలు తనిఖి సేసి- వోళ్ల వోళ్ల సాచ్చాలు వినుకొని- వోళ్ల వోళ్ల హక్కులు ఖాయపరస్తారు కాబట్టీ- సకలమైన వోళ్లున్నూ అర్జీలతోనూ సాచ్చులతోను- అక్కడ అనగా రాదారీ బంగాళా కాడ 4 గంటలకి హాజరు కావలసిందోహోయి. (తుడుము కొడతాడు)

వారసులందరూ పులోమని ఒకరి వెనుక ఒకరుగా దిగివచ్చి ఏమిటోయ్- ఏమిటి? కలక్టరు వచ్చేడా వస్తాడా? దొరా బ్రాహ్మడా?' మొదలయినవి తలా పది ప్రశ్నలూ అడుగుతారు. వాడు పైపాఠం తూ చా తప్పక వల్లిస్తాడు.

## ప్రవేశిక

రాదారి బంగళాలో ఒక పెద్దగది. సబ్ కలెక్టరు రామయ్య మీదా ఎదురుగా టేబిల్; పైని పూలూ పంతులు గారొక కుర్చీ మీదా చలమయ్య శాస్త్రి ఒక కుర్చీ అగరువత్తులు. శాస్త్రిగారి ప్రక్క గ్రామ

కరణమూ నిల్చున్నారు. గేటు దగ్గిర బంట్రోతు హనుమంతు—చలమయ్య శాస్త్రి వయసు 54. కాయశరీరం. చామనచాయగా 50 లోపుగా కనబడతాడు.

కలె:—చలమయ్యశాస్త్రిగారూ! అయితే మీ రే తేదీని చని పోయినట్లు?

చల:—ఇదిగో మా బుచ్చిపంతులకు తెలుసును.

కలె:—ఏమి బుచ్చిపంతులూ! చలమయ్య శాస్త్రి గారిని నువ్వే తేదీని చంపివేసినావు?

బుచ్చి:—నావశమా? నేను చంపి వేయడమే మిటండి! భద్రాచలం నుంచి వస్తూ వున్న స్టీములాంచి మునిగి పోయింది.

కలె:—అంటే ఈయన మునిగి పోయినారన్న మాట.

బుచ్చి:—మరి ఈయనా భద్రాచలం వెళ్లేగండి.

కలె:—అయితే చనిపోయనట్లు వ్రాసి వేస్తారా?

బుచ్చి:—ఇటువంటివి ఆంధ్రపత్రికలో వేస్తూ వుంటారండి '16 తేదిని భద్రాచలం నుంచి వస్తూ వున్న స్టీము లాంచి మునిగి పోయింది' అని ఆంధ్రపత్రికలోనే వ్రాసి శారు- చిత్తగించండి. ఇందులో ఈయన కూడా వుంటారని- మనసు పాపిష్ఠిది గదండీ- అభిమానస్థుల విషయమే శంకిస్తుంది- విచారంతో వ్రాసినానండి- 'ఇంత ఆస్తి వున్నది. ఇరస్తాపరస్తా ఎవ్వరూలేరు; ఈ ఆస్తి అంతా యేమిగానో' అని. నా వల్ల తప్పే వచ్చిందండి- క్షమించండి.

కలె:—అయితే అభిమానం చేతనా ఈలాగు వ్రాసినారు?

బుచ్చి:—ఔనండి.

కలె:—కరణంగారూ! ఆయన ఆస్తి అంతా జాగ్రత్తగా వున్నదా?

కరణం:—చిత్తం తమఘనతా! ఒక పూతిక పుల్ల కదల లేదండి. ఈ ఘోరవార్త తెలిసిన ఉత్తరక్షణమే ఇంటికి సీళ్లు వేశానండి. వెంటనే తమ ఘనతగారికి తెలియ జేసుకొన్నాను కూడా నండి.

కలె:—ఏమి చెలమయ్యశాస్త్రిగారూ! మీ ఆస్తికి మీరూ వారసులే కదూ మీరేమి యత్నంలో వున్నారు?

చల:—తీర్థయాత్రలు సేవించుకొని నిన్న వుదయం గ్రామంలో ప్రవేశిస్తున్నానండి. అంతవరకూ నాకేమీ తెలియదు. రావడమే శివా మని మొట్టమొదట- జగ్గన్న చెరువు గట్టు మీద యథాశాస్త్రంగా శ్రాద్ధకర్మ చేస్తూ వున్న యీ పటాలమంతా చూచేసరికి నా గుండె బ్రద్ధలయి పోయిందండి. క్వెట్టాభూకంపం వంటి ఉత్పాతమేమైనా మా నరసయ్యామ్మాగ్రహారానికి వచ్చిందా అనుకొన్నాను. తర్వాత బండివాడు చెప్పినాడండి- దీనికి కారణమంతా.

కలె:—బండీవాడికి మీరే ఆ చలమయ్యశాస్త్రిగారని తెలియదేమో?

చల:—చిత్తం. పట్నం బండీ అండి. వెంటనే బండీ తిప్పించి, రాదారిబంగళాలో బసచేసి, కరణం గారికి కబురంపిస్తే, వచ్చి వారు చెప్పినారండి ఈ గాథ అంతా. తమరూ ఈ రోజున దయచేస్తూన్నట్లు చెప్పినందువల్ల తమ దర్శనమిక్కడే అవుతుందని నేనూ ఇంకే మీ యత్నం చెయ్యా లేదండి. కరణంగారికి తప్ప ఇంకెవరికీ తెలియకుండా ఈరహస్యం కాపాడినాను.

కలె:—చాలా తెలివైన పని చేసినారు.

బుచ్చి:—ఇక్కడికి వచ్చేవరకూ శాస్త్రిగారు బ్రదికి వున్నట్లు నాకు కూడా తెలియదండి. చూచి నివ్వెర పోయినాను.

కలె:—తెలిస్తే పల్లీ పత్రికకు రాసివేదురా?

బుచ్చి:—చిత్తం. పోస్టుమాస్టర్ని కదండీ- వార్తలంటే సరదా లావు.

కలె:—పత్రికకు వ్రాస్తే మీ కేమిస్తారు?

బుచ్చి:—ఏమీ ఇవ్వరండి. కీర్తి అంతే.

కలె:—శాస్త్రిగారూ! మీరీవూరు వచ్చి యెంత కాలమైంది?

చల:—18 ఏండ్లు- కొన్ని మాసాలు.

కలె:—అంతకు పూర్వం?

చల:—గుంటూరులో వుండే వాణ్ని. అక్కడ సంసార సంబంధమైన కొన్ని చిక్కులు వస్తే వాటికి తట్టుకో లేక ఈ మండలంలో - ఈ మారుమూల పల్లెకు వచ్చి ఇక్కడ ఇల్లూ వాకిలీ ఏర్పరచుకొని జీవిస్తున్నాను.

కలె:—మీ కుటుంబ మే మాత్రం?

చల:—ఇప్పటికి నే నొక్కడనే- అదైనా మా బుచ్చి పంతులు మిగిలిస్తే. నా భార్య 20 ఏళ్ల క్రిందట పోయింది.

ఒక తహ-తుతుండేది అదీ పోయింది. నాగ క్షేత్రి ప్రాణ కొంతకు పట్టు వేశాను.

కల:—అయితే మీకా కక్షిదారులూ లేరు?

చల:—'నా' అనే వారు ఒక్కరూ- ఒక్క ప్రాణి లేదు- ఈ విశాల భూ ప్రపంచంలో- ఇప్పుడే కనబడుతూ వున్న 37 మంది వారసులూ తప్ప.

కల:—అయితే యేమి చెయ్య బోతున్నా రీ వారసులతో?

చల:—అధి కారులు తమరే నిశ్చయించవలె. ఇంత వరకూ నేను వీరి దివ్యముఖారవిందాలను చూడనే లేదు. వీళ్ల పేర్లు కూడా విన లేదు. నా ఆస్తికి నేనే వారసుణ్ణి లేక అంతకంటె దగ్గర వారసులు వీళ్లలో యెవరైనా వున్నారో ముందు చూచుకో వలె.

కల:—కరణంగారూ! ఈవారసుల పేర్లూ- సంబంధాలూ- హక్కులూ అన్నీ తసిల్ వారికీగా తయారు చేయమన్నారు- చేశారా?

కర:—చిత్తం తమఘనత! చిత్తగించండి (ఎదుట కాగితముంచుతాడు)

కల:—(పరిశీలించి) ఇందులో మీ కొక భార్యా కుమారుడూ కనబడుతున్నారండీ!

చల:—భగవంతుని కరుణ! నా జీవితంలో లేక పోయినా, నా జాతకంలో అంతకన్నా లేక పోయినా- ఈవిధంగానైనా నాకు ముచ్చట తీరుతున్నాది.

కల:—వారినే మొదట రప్పిద్దాము.

చల:—ఔను. అంతకన్న దగ్గర బంధువులెవరు? కాని మీరే మాటాడవలె. ఆమనిషి ముఖం చూడగలనా అని నా సందేహం!

కల:—అమ్మమ్మ! అదేమి మాట! ఇంగ్లీషులో ఒక సూక్తి వుంది- ఒకడు దగుల్బాజీ అని తేలేవరకూ అతడిని తగుమనిషిగానే భావించ వలెనని. అలాగే, ఆమె మీ భార్య కాదు అని నిశ్చయమయే వరకూ మీ భార్య అనే భావించ వలసి వుంటుంది. కనుక ఆమెతో మాటాడడానికి మీకే అధికారం.

చల:—భర్తకులేని అధికారాలు కూడా కోర్టువారికున్నవి కదా!

కల:—ఎక్కడా కాలేదండీ! హనుమంతూ! వారిని నాంచారమ్మను పిలువు.

హను:—కారిసు నాంచారమ్మ (హనుమంతు పిలుస్తాడు) నాంచారమ్మ- 35 సం॥ వాలుసవాయి; పొడవు, బందోబస్తు. ముఖం చూస్తే కొంత చరిత్ర గల మనిషి లాగ కనబడుతుంది. వెంట కొడుకు 6 సం॥ వయస్సు గలవా వస్తుంటాడు.

కల:—పేరు?

నాంచా:—నాంచారమ్మ

కల:—ఇంటి పేరు?

నాంచా:—గన్నవోరమోరు.

కల:—భర్త పేరు?

నాంచా:—చలమయ్య శాస్తుర్లు.

కల:—జాతి?

నాంచా:—బ్రాహ్మలం.

చల:—చూస్తేనే తెలుస్తూ వుంది.

కల:—శాఖ.

నాంచా:—ఏమి శాఖండీ?... శాఖ లేదు... నాకు తెల్దు.

చల:—ఔను. శాఖ లేమిటి? ఒకటే తుండెం.

కల:—మీరడగదలచుకొన్న ప్రశ్నలడగండి.

చల:—అడిగే దే ముంది?...మీదేవూరు?

నాంచా:—ఈవూరేనండి. కాని పెళ్లి కాండ నుంచీ కర్నోరింటనే వుంట.

చల:—కారణం?


నాంచా:—శాస్తుర్లు అనుమానంగొడ్డూ కోపగిష్టిమనిషినండి. అతగాడికి సాని. తాగొచ్చి నన్ను చావగొట్టేవాడండి.

చల:—రామపాహి! సానీ త్రాగుడూ కూడానా? జూదమాడే వాడకే?

నాంచా:—కాబోలు నండి. అప్పులవోళ్లెప్పుడూ పట్టక లాగటమే.

చల:—చలమయ్యశాస్త్రి ఏలాగుండేవాడు?

నాంచా:—ఎప్పుడూ దుమదుమలాడుతూ మింగేద్దామా అన్నట్టుండేవోడు.



చల:—కాదు రూపం?

నాంచా:—ఒక తెల్లయెలుగుగొడ్డు నాగుండేవోడు- పరమ మోట.

చల:—నువ్వి దివరకెప్పుడైనా యీవూరు వచ్చినావా?

నాంచా:—లేదు. అతగాడి కేమవుతుందో ఇక్కడికి రానిచ్చేవోడు కాదు. మనసు పుడితే తానే అక్కడికొచ్చి 10 రోజులుండి పోయే వాడు. ఆలాగు వాయిదాల మీద పుట్టిన వాడే యీ కుర్రోడు.

చల:—అబ్బాయీ! మీ నాన్నగారి పేరేమిటి?

అబ్బాయి:—అఁ- ఏటే?

నాంచా:—మీ అయ్యపేరేట్రా పెద్దమ్మా?

అబ్బాయి:—యీరబద్దరాశార్లు.

నాంచా:— ఛీ- గాడిదా! (పెడీమని తల మీద కొడుతుంది)

బ్బాయి:—(మెల్లిగా, బెక్కుతూ) సెలమయ్య శాత్తు-ర్లు (ఏడుస్తాడు)

కలె:—ఇంక సందేహమేమిటండీ- నువ్వాలాగు కూర్చో...శాస్త్రిగారూ! ఇందులో ఒక వీరభద్రాచార్లున్నాడు... రప్పిద్దాం. హనుమంతూ? పిలూ- వారసు వీరభద్రాచార్లు.

హను:—వారసు యీరబద్రాశార్లూ (ముమ్మారు పిలుస్తాడు) వీరభద్రాచార్లు- 40 సం॥ నల్లగా పొడవుగా వుంటాడు. బాదంకాయల లాగు కళ్లు. క్రూరత్వం మూర్తీభవించింది.

కలె:—పేరు?

వీర:—వీరభద్రాచార్లు.

కలె:—ఇంటిపేరు?

వీర:—గన్నవరమువారు.

కలె:—(నాంచారమ్మను చూపి) ఈమెను నీకు తెలుసునా?

వీర:— తెలియదు. ఈమె మొఖం నేను చూడలేదు.

అబ్బాయి:—అయ్యా! అమ్మకొట్టింది. (ఏడుస్తూ ఆచార్ల దగ్గరకు వస్తాడు)

వీర:—ఛీ వెధవా! (పెడీమని తల మీదనే కొడతాడు)

అబ్బాయి:—(సదయ నిలబడి గట్టిగా ఏడుస్తాడు)

కలె:—ఎవరో పరాయి మనిషి కుర్రాణ్ని కొడితే వూరుకుంటా వే మమ్మా?

నాంచా:—ఆయనా? ఆయన మా సుట్టమేనండి.

వీర:—ఈవిడా? ఈవిడ నాకు కొంచెం పరిచయమేనండి. మేము విశ్వకర్మలం చూడండీ- ఏదో వస్తువనీ, వాహనమనీ—

చల:—ఈ వాహనాని కా వస్తువులు నీచేతివేనా?

వీర:—మీ మాట నాకు తెలియ లేదు.

...Nikethan
VETA



చల:—నువ్వు కంసాలివని చెప్తున్నావు—

వీర:—మేము కంసాల్లం కామండీ- విశ్వబ్రాహ్మణులం.

చల:—సరే దానికేమి- మరి ఆయన బ్రాహ్మణుడటే?

వీర:—ఔను. విశ్వబ్రాహ్మణులేమిటి? బ్రాహ్మణులేమిటి? ఒకటే.

చల:—కాని ఆయన విశ్వబ్రాహ్మణుడు కాని బ్రాహ్మణుడట.

వీర:—లేదండి. ఈయన మాత్రం బ్రాహ్మణుడు కాని విశ్వబ్రాహ్మణుడండి. ఇంతెందుకు? మా పెత్తాత గారి చిన్నమనవడు, ఈ వంశవృక్షం చూడండి, (చూపుతూ) చలమాబత్తుడని మా పెత్తాతగారి ముత్తాత గారండి.

కలె:—చూశారా! ఈ విషవృక్షం ఎన్నిరంగులతో ఏలాగు వేశాడో!

చల:—ఏలాగైనా శిల్పి కదండీ!

వీర:—ఎర్రరదళాలన్నీ చచ్చిపోయిన వారు; పచ్చనివి బ్రతికున్న వారు.

చల:—మరి లేని పోని వారినే రంగులో వేశావు?

కలె:—అయితే చలమయ్యశాస్త్రి గారికి నువ్వు వారసుడనంటావు?

వీర:—అవునండి.

కలె:—ఆయన భార్యాపుత్రులున్నప్పుడు?

వీర:—ఉంటే వారికిచ్చి వేయండి. నాకన్యాయం వద్దండి. వారికో నాకో-

కలె:—అరుగో వారే ఆయన భార్యాపుత్రులు.

వీర:—చిత్తం. సంతోషం. వారికే ఇచ్చి వేయండి.

కలె:—ఏమమ్మా- నీ విషయం సందేహంగా వుంది. ఇంతకంటె మంచిసాక్ష్యం తెచ్చుకొంటావా? ఇతగాడి కాస్తి అప్ప చెప్పి వేయమన్నావా?

నాంచా:—మీ యిష్టమండి- ఆడదాన్ని నాకెక్కడ సాచ్ఛం పలుకుతుంది.

చల:—ఏమి అన్యోన్యం! పోనీ మీ ఇద్దరికీ మొత్తం మీద అప్పచెబితే?

ఉక్తరూ!—ఓ- ఏదిక్కూ లేకుండా సద్దుకుంటామండీ- అలాగే చేయించండి.

కలె:—సరే - నువ్వు వీరి దగ్గర కూర్చో. తక్కిన వారసులని చూస్తాము... వీరి దగ్గర యేదో విల్లున్నదటండీ!

చల:—శివవిల్లా? హరివిల్లా? ఆ విల్లుతో ఆ అర్జునుణ్ని రమ్మనండి చూస్తాం.

కలె:—వీరు ముగ్గురు సోదరులట. హనుమంతూ పిలూ- పేరయ్యా బ్రదర్సు.

హను:—వారసులు - పేరయ్యా బ్రదర్సు (ముమ్మారు పిలుస్తాడు)

(పేరయ్యా బ్రదర్సు - వృత్తికి తగిన వేషాలతో)

కలె:— మీ పేర్లు?

పేర:—(చూపుతూ) పేరయ్యా- రామనాథం- సత్తె రాజూ.

కలె:—ఇంటి పేరు?

పేర:—కాశీవారు.

కలె:—మీకూ చెలమయ్యశాస్త్రిగారికీ సంబంధ మేమిటి?

పేర:—ఆయనకి సయాం మేనల్లుళ్లమండి- మేం ముగ్గురమున్నా.

కలె:—వారిని మీ రెరుగుదురా?

పేర:—అయ్యో! మొన్న మొన్నటి దాకా- వాకి పూరు వచ్చేవరకూ వారి యింటిలోనే వుండే వారమండి.

కలె:—ఏ వూరిలో?

పేర:—అగ్రామమా అండి... చెప్తా... తమ్ముడూ ఏవూరు? ఆఁ గుళ్ల వలస.

కలె:—రాళ్ల వలసా? గుళ్ల వలసా?

పేర:—రాళ్ల వలసే నండి- అదేగుళ్ల వలస.

కలె:—వారు రాసిన విల్లు మీ దగ్గర వుందట గదూ?

పేర:—అవునండి.

కలె:—రిజష్టరయిందా?

పేర:—లేదండి,

కలె:—ఇది మీ కేలాగు వచ్చింది?

పేర:—ఆయన భద్రాచలం వెళ్లవలయునని వాటి కొండలను కొలుచుకుని, శరీరమున్నంతవరకు ఎప్పటికైనా నా అని తలచి- ఏమైనా అసందర్భం జరిగితే ఆస్తి ధర్మంగా చెయ్యవలె నని విల్లురాసి పంపినారు- చిత్తగించండి.

కలె:—(పుచ్చుకొని) ఇందులో ముఖ్యవిషయా లేమిటి?

పేర:—ఆస్తి అంతా నగదు చేసివేస్తే ఆరులక్షలవుతుందని- అది మూడుభాగాలు చేసి ఒకటీ- వేశ్యలలో విద్య అంతరించి పోతూవున్నది గనుక దాన్ని వుద్ధరించడానికై 'భరతనృత్యపాఠశాల' ఒకవంతుతోనూ, రెండూ, ప్రజలసౌకర్యార్థం 'డిస్ట్రిక్టు బస్ సర్వీస్' ఒకవంతుతోనూ, మూడూ, ముసాఫర్ల ఉపయోగార్థం 'చెలమయ్య విలాస్' అని తనపేరు శాశ్వతంగా వుండేటట్లు ఒక గొప్ప మెడ్రాసు కాఫీహోటల్ ఒకవంతుతోనూ పెట్టవలసిందని రాసినారు. ఈ మూడింటికీ మా ముగ్గురు సోదర్లనూ ప్రప్రయిటర్లను చేసినారు.

కలె:—మీరేవృత్తులు చేస్తున్నారా?

పేర:—నేను వేశ్యలకు భరతనాట్యం చెప్తానండి.

చల:—అయితే యిందులో బస్ కండక్టరెవరు?

పేర:—మా తమ్ముడు రామనాథమండి.

చల:—ఈయన కాఫీహోటల్లో సెర్వారా యేమిటి?

పేర:—చిత్తం. బాగా గ్రహించారు.

కలె:—ఆయనకు సాన్లంటే చాలా అభిమానమా అండి?

పేర:—సాన్ల కంటె విద్యా అంటే ప్రీతి.

నాంచా:—నేను చెప్పాను కానండీ- ఆయన రెప్పడూ సాన్లయిళ్లల్లోనే వుండే వాడు- అక్కడే తినేవాడు కూడా-

చల:—చప్- నువ్వు నోరు మూసుకో.

వీర:—ఆడవాళ్ల మీద అలాగు కలియ బడతారే మిటండి- ఎంత అధికారులైనా-

కలె:—అయితే చూడండి- ఇరుగో. ఆయనకు భార్యా పుత్రులున్నారు. తమ్ముడున్నాడు. వీరిని గురించి విల్లులో యేమీ వ్రాయ లేదా?

పేర:—వీరెవరండి! ఇతడు కంసాలి; ఈమె సాతాని మనిషి. వీళ్లకీ ఆయనకీ సంబంధ మేమిటండి?

వీర:—నీకూ ఆయనకీ సంబంధమేమిటి?

చల:—అసలు గ్రామంలో వచ్చిన 37గురు వాళ్లల్లో ఎవరికీ ఆయనకీ సంబంధ మేమిటి?

వీర:—నిజమండి, నా యెదుటకు వస్తే నేను చెప్తాను. ఆయన విశ్వబ్రాహ్మణుడు.

కలె:—చాలు ఊరుకోండి. మీరూ ఇటు కూర్చోండి. ఈ సాహుకారువద్ద 43000 బాకీ అని వ్రాస్తున్నాడు. చూదామా?

చల:—అది వీటన్నిట్ల కంటే ముఖ్యం.

కలె:—హనుమంతూ- పిలూ- సాహుకారు- వరాల రెడ్డిని?

హను:—సావుకారు వరాలరెడ్డీ (మూడ్మారు పిలుస్తాడు)

(వరాలరెడ్డి పత్రాలతో)

కలె:—నీకు చలమయ్యశాస్త్రిగారెంత బాకీ?

రెడ్డి:—దండాలు దొరగారు. 43000 వడ్డీతో. పత్రాలున్నాయి బాబయ్యా.

కలె:—అయ్యా చూడండి

చల:—ఏమి వరాలరెడ్డి. మరచి పోయినావు. దయ లేదు.

రెడ్డి:—బాబు బాబు! చెలమయ్య శాస్త్రిగారు! మా గారూ! గ్రహించినారా? అదే పదివేలు. అదే మాకు కావలసింది. (పత్రాలు దాచి వేస్తూ) అబ్బబ్బా! ఎంత మాట యిన్నాం శాస్తుర్లుగారూ! జూబరా ముండా కొడుకు మా నాగభోషణం వొద్దురా అయ్యా అంటూంటే ఆంధ్రపత్రికట ఒక గజటు పేపరు అణా యిచ్చి కొనుక్కొచ్చేడు. ఏలాగూ డబ్బొదిలి పోయింది పోనీ సదువుదాం సాయంకాలమేటి సెయ్యాల గనక అని సూతను- అందులో వుంది బాబూ శలమయ్యశాస్త్రిగారి రామాయణం' అని. రామాయణమంటే యేట్రా అని కింద సూతను- గుండె బద్దలై పోనాది. మా శలమయ్య శాస్తుర్లుగారి ప్రాణానికి ఈ బద్రాశలమెక్కడొచ్చింది? ఈ గోదారి ఎక్కడొచ్చింది. ఓరి బగమంతుడా! తిరుపతి లాగ బద్రాశలం కూడా గోదారి పక్క లేకుండా ఏడుకొండల మీదనైనా వుండ కూడదా' అని ఒకటే గోలేత్తేసినాను. కొట్టు కాడ కూకో బుద్ది పుట్టదు; ఇంటి కాడ తొంగో బుద్ది పుట్టదు.

కలె:—సరే- చలమయ్య శాస్త్రిగారు నీ కెంత బాకీ-

రెడ్డి: అప్పులూ, బాకీలూ, ఆస్తిపాస్తులూ, సొమ్ముతాలూ తాకట్లూ చేసే వాడుయిల్లు శాస్త్రిగారు బతికున్నారు. నాకు బాకీ యేటి? ఇంకేటి? సిత్తు కాగితాలు. సీస్త్రి. సింపేత్తా (చిన్న ముక్కలుగా చించుతాడు)



వారసులు:—ఏమిటి! చలమయ్య శాస్త్రిగారు బతికున్నారా? ఎవరు? వీరే!

రెడ్డి:—ఓయి య్రెరిమొగాల్లాలా! అరు సెలమయ్య శాత్తుర్లగారంటే మరినేనా? ఆ మొగంలో ధనలచ్చిమి ఆ కళ అయినా సూసినారు కారా! ఏటి బాబయ్యా! మీరు సచ్చి పోనారని గజిట్లో యేసేసినారే- గవర్నమెంటోడూ అబద్ధమాడతాడా?

కలె:—ఏమి ఇట్టి! ఏమిటి సంగతి? నేను నీకెంత బాకీ వున్నాను?

రెడ్డి:—ఇప్పుడు బాకీ యేటి మారాజా! తమకి వారసులెవరూ లేరంటే దినవారాలు బాగా జరుగుతాయో జరగవో అని సేతులో వున్న 43000 వేలూ పట్టుకొచ్చినాను. అంతే మారాజా 43000 అంటేను- బాకీలంటేను మీరు సల్లంగా కంటికగపడ్డారు. అదే పదివేలు డబ్బు- సొదవ డబ్బు- మాలచ్చిమిని తిట్ట కూడదు గాని!

కలె:—ఏమి వారసులూ! ఇదేమిటిది? ఇంత సేపూ చలమయ్య శాస్త్రిగారి పెండ్లామూ, పిల్లడూ, బుచ్చి తమ్ముడూ, ముద్దు మేనల్లుళ్లో అనుకుంటే పులి మీద పుట్రలాగు ఇప్పుడు హసలు చలమయ్య శాస్త్రిగారే లేచి వచ్చారే!

వీర:—ఈయన హసలు చలమయ్యశాస్త్రిగారు కారండి.

కలె:—పరాబులు - నాడెం మీకు తెలియవలె. భార్య యేమంటుంది?

నాంచా:—ఈయన కారండి.

కలె:—పతివ్రత భర్తకు వేరే మాట ఆడుతుందా!

చల:—ఆడితే మగడు చీల్చేస్తాడు గాని ఊర కుంటాడా?

నాంచా:—నిజం ఈయన నా భర్త కారండి.

చల:—నిజం నిజం. ఆయన తెల్ల వెలుగుబంటి లాగుంటాడు. ఏం మేనల్లుళ్లూ?


పేరయ్య & బ్రదర్సు - ఈయన కానేకారండి.

రెడ్డి:—ఓయి య్రెరిమొగాలూ! జట్టి బేరం తెగి పోయిన తర్వాత ఇంకెందుకు పీకులాడతారు? అయినో డంగట్లో కూకుంటే కానోడికి కాసైనా సిక్కుతాదా? అడుగుతున్న వోరు కలెక్టరు బాబు. ధర్మరాజు లాటోరు. అడ్డదిడ్డంగా మాటాడితే బేడీలు పడగలవు. తప్పుకోండోయి నాగమ్మలు తప్పుకోండి.

కలె:—అయితే అందరు కూడా ఈయన కాదంటారు?

వారసులు:—కాదండి ఏమాత్రం కాదు. ఇమిటేషన్ చెలమయ్యశాస్త్రి.

కలె:—మీరందరూ ఇమిటేషన్ వారసులైనట్లు.



అయినా తక్కిన వారిని కూడా అడుగుదాం హనుమంతూ! వారసులందరినీ ఒక్క మారు రమ్మను.

హను:—తక్కిన వారసులందరూ ఒక్కమారు రావాలా. (ముమ్మారు)

(వారసులందరూ ఒక్కమారు వస్తారు)

కలె:—ఆహా - లోకంలో వైదిక కర్మా సనాతనాచారం నశించి పోతున్నాదంటే యేలాగు నమ్మడం- ఇన్ని తలకాయలు ఒక్కమారుగా సాక్ష్యమిస్తూ వుంటే? వారసులలో కొందరు- ఇరుగో చలమయ్య శాస్త్రిగారు! ఇదేమిటి? శాస్త్రిగారే!

కలె:—ఏమి వారసులు! చలమయ్య శాస్త్రిగారు వీరేనా?...ఇంకా శాస్త్రిగారి ఆస్తి కోసం ఆశ యెవరికైనా వుందా?...ఇందులో నిజంగా వీరి సంబంధస్తులెవరైనా వుంటే చెప్పండి... లేనట్లేనా?...శాస్త్రిగారూ మీరూ ఓ మారు చూచుకోండి ...ఎవడైనా వారసుడున్నాడేమో ఇందులో.

చల:—నా డబ్బుకు వారసులున్నారు గాని నాకు లేరు.

కలె:—హనుమంతూ! వెనక గదిలో వున్న పోలీసులను రమ్మను.

(పోలీసులు వస్తారు)

వీళ్లందరకూ బేడీలు వెయ్యండి- తీసుకు పొండి.

(వారసులందరూ మొఱ్ఱో! మంటారు)

రెడ్డి:—బాబూ! నేను వారసుణ్ని గానే- నాకూ బేడీలు వేస్తారా?

నాంచా:—యెదవా! అంతా సెడగొట్టేసి నావు. (కొడుకును కొడుతుంది)

(పోలీసులు బెత్తం ఝుళిపించి అందరినీ తీసుక పోతారు)

చల:—ఇప్పటికి తల చులక పడ్డది...వారసులంటే భూలోక యమదూతలు?

కలె:—మీ తల చులక పడ్డది గాని...మాకు మల్లీ వుంది యీ రాద్ధాంతమంతా, మేము మీ కంటె ముందు కాకుండా వుంటే - నేడు కాకుంటే పదేళ్ల నాటికయినా.

చల:—దిక్కుమాలిన బ్రతుకంటే యిప్పుడు నా కర్థమయింది.

కరణం:—తమ ఘనత గారు! మొదట ఈయన మా గ్రామం రావడమే వివాహం చేసుకోవలసిందని నేను చెప్పినాను- చెప్పించినాను కూడా నండి. అప్పటికీయనకి 34 ఏళ్లు- ఎంత బాగుండేది! ఈ పాటికి 20 ఏళ్ల కొడుకు!

బుచ్చి:—ఇప్పుడైతే నేమి? కావలిస్తే 30 మంది పిల్లల్ని నేను తెస్తాను- క్షణంలో.

కలె:—ఆంధ్రపత్రికలో ప్రకటిస్తారా యేమిటి?

బుచ్చి:—అంత శ్రమ యెందుకండీ? చెప్తా (వెళ్తాడు)

[illegible] VETAPALEM.



కళ: [illegible] శాస్త్రి గారూ ?

చల:—(వెడవెడ నవ్వుతూ) ఈ వయసులో పెండ్లి చేసుకోనేటప్పుడు ఒక్కరిని చేసుకొని లాభం లేదు. ఆమె విశ్వాసంగా వుంటుందనీ ఆమె వల్ల నాకు దినం తీరుతుందనీ నిశ్చయమేమిటి ? ఒక పది పాతిక మందిని ఒక్కసారే పెండ్లాడేస్తే - ఒకర్తెను నేను విడిచినా ఒకర్తె నన్ను విడిచినా, ఒకర్తె తప్పి పోయినా, ఒకర్తె గొడ్రాలయినా, కొసకు ఒకర్తె వల్లనైనా సుఖ పడవచ్చునేమో ! ఇక నావల్ల సుఖమనేది- ఒకర్తెకెంతో అందరికీ అంతే. కనుక హెచ్చుతగ్గు భేదాల మీద ఈసు రోసాలూ పట్టు పంతాలూ వుండవు. అందరూ ఏపని చేసినా కలిసి చేస్తూ వుంటారు.

(బుచ్చిపంతులు 30 మంది ఆడ పిల్లలతో

బుచ్చి:—ఇదుగోనండి- 30 మంది ఆడ పిల్లలు తెచ్చాను. దొరగారికి దండం పెట్టండి. (పడతారు)

కళ:—ఇదేమిటిది ? మీరు ఈ చలమయ్య శాస్త్రి గారిని పెళ్లాడతారా ?

(బుచ్చిపంతులు వారికెదురుగా నిల్చి తల వూపుతాడు; వారూ వూపుతారు)

కళ:—మీది మా మంచి తరిఫీదండి. సరే ఓ ప్రక్క కూర్చో పెట్టండి.

బుచ్చి:—అందరూ వరసగా మాటాడకుండా కూర్చోండి (గొడుగుతో పెత్తనం చేస్తాడు)



కరణం:—వారికి పెళ్ళంటే సవ్వెరాలుగా వుంది. పోనీ ఒక చిన్నపిల్లవాణ్ణి దత్తతి.

చల:—కంటే కర్మం గాని పెంచుకొంటే ప్రాలబ్ధమూ అని...దత్తపుత్ర శోకం అన్ని శోకాలలోనూ గొప్పది. దత్తతి విషయం కూడా అంతేనండి. పుడితే పదిమంది కొడుకులను పెంచలేదూ? పెంచుకొంటే మాత్రం పదిమంది యెందుకు కూడదూ? అందులో ఒకడు కాకుంటే ఒకడైనా పనికొస్తాడేమో! మనకు దత్తులే కావలెనంటే ఈ వారసులందరూ వస్తారు.

బుచ్చి:—వాళ్ళెందుకండి? కావలిస్తే 40 మంది పిల్లకాయల్ని నేను తెస్తానండి. అబ్బాయిలూ-

(40 మంది పిల్లకాయలు వస్తారు)

అందరూ దొరగారికి సలాం చెయ్యండి. (చేస్తారు)

కలె:—ఈ చలమయ్య శాస్త్రిగారు మిమ్మల్ని పెంచుకుంటారట- మీకిష్టమేనా? (బుచ్చిపంతులు తల ఊపుతాడు; అందరూ ఊపుతారు) బాస్. బాగుంది. నువ్వు బ్రహ్మదేవుడు లా గున్నావు- ఒక్కరిని తలచుకొంటే నూరు మందిని హాజరు పెడుతున్నావు. ఇంత స్వల్పకాలంలో ఇంతమందిని ఏలాగు జత పరుస్తున్నావయ్యా?

బుచ్చి:—నేను ఎయిడెడ్ స్కూలు హెడ్మాస్టరునండి. నా బడిపిల్లలు వీళ్ళంతా.

కసె:—ఇందాకా పోస్టుమాస్టరునని చెప్పినావు?

బుచ్చి:—అవునండి. ఈ వూరికి బడి మాస్టర్ని పోస్టుమాస్టర్ని కూడా నేనే.

కలె:—బాగుంది. శాస్త్రిగారికి వారసత్వపు ఆస్తి వచ్చింది గనుక రేపు మీ స్కూలుకు వచ్చి పిల్లలందరికీ మిఠాయి యిస్తారు- ఇప్పటికి తీసుక వెళ్ళండి.

బుచ్చి:—ఏయ్ అబ్బాయిలూ అమ్మాయిలూ; రేపు మీకు దొరగారూ శాస్త్రిగారూ మిఠాయి యిస్తారు గనుక అందరూ చక్కగా తలలు దువ్వుకొని బాగా ముస్తాబై రండి. పదండి. (పిల్లలతో వెళ్తాడు)

కలె:—అయితే పెండ్లాడక దత్తత చేసుకోక పోతే యేం చేస్తారు?

చల:—ఈ రెండూ తప్పించి యేమైనా చేస్తాను. పెండ్లాం- దత్తులూ- వారసులూ మాత్రం వద్దు.

కలె:—ఇంకేదైనా సత్కార్యముల కోసం ఆస్తి వ్రాసి వేయ వలె.

కరణం:—ఇప్పుడు వారు చేస్తూన్నవన్నీ సత్కార్యాలే కదటండీ తమ ఘనత! వారు మా గ్రామం వచ్చిన తర్వాత లేమీ దుఃఖమూ అన్నవి ఇక్కడ లేవండి.

(బుచ్చిపంతులు వస్తాడు)

బుచ్చి:—అయ్యా! మరో సంగతి. వారసుల మని బండీతో ఇంకా కొందరొచ్చారండి.

కలె:—ఎంత మంది?

బుచ్చి:—ఒక బండెడున్నారు- మగాళ్ళూ ఆడవాళ్ళూ పిల్లలూ పెద్దలూ-

చల:—సరి పోయింది! ఈ బాధ ఇంకెన్నాళ్ళుంటుంది చెప్మా?

కలె:—మళ్ళీ బుచ్చిపంతులు గారనుగ్రహించే దాకా. శాస్త్రిగారు బ్రతికి వున్నారని తిరిగీ ఆంధ్రపత్రికలో వేస్తే అప్పుడణుగుతుంది ఈ రద్దీ.

చల:—బుచ్చిపంతులూ వెళ్ళి చెప్పు- చలమయ్య శాస్త్రి దుక్కలాగున్నాడు- ఇప్పుడేవరు వచ్చి లాభం లేదు. కొద్ది కాలంలో కాని వెళ్ళడు గంగలో పడి పోయినాడని తెలిసిన తర్వాత గా వచ్చునని.

బుచ్చి:—ఈ మాట నిజం తెలుసుకోండి పేపర్లో వెయ్యను...కాని వాళ్ళతో చెప్పి నా నండి మీరు సజీవులై యున్నారనీ- వారసులని వచ్చిన వాళ్ళనందరికీ సెకీలు జేసి జైళ్ళలో పెట్టి స్వేచ్ఛాలంకాగ వాసం పంపించ నున్నారని కూడా. ఆ మాట చెప్పినా వారు 'చలమయ్య శాస్త్రిగారే వుంటే మాకు కావలసిందే అది. వారి దర్శనం చెయ్యందీ వెళ్ళము' అన్నారండి.

కలె:—తెలిసిన తర్వాత కూడా రా దలచుకొంటే వారిని తప్పక చూడ వలసిందే. పంతులూ! వెళ్ళి తీసుకరా. మళ్ళీ చెప్పు- వారు బ్రదికి వున్నారనీ- ఇక్కడే వున్నారనీ.

(బుచ్చిపంతులు వెళ్తాడు)

చల:—ఆ వీరభద్రాచార్లు వంటి పెుండి ఘటాలెవరో అయి వుంటారు. ఆ కుటుంబం మరవను.

కలె:—ఏది యేలాగైనా మీరు కొంచెం వేగంగానే యేర్పాటులు చేయవలె.

విశా:—ఇప్పుడు కళ్లు విచ్చాయి; బుద్ధి వచ్చింది. పెద్దలు అమరున్నారు. తమ ఆజ్ఞ చొప్పున నడుచుకొంటాను. నన్ను ఒడ్డున చేర్చండి.

(బుచ్చిపంతులు, వల్లభరావూ ముగ్గురు పిల్లలతో వస్తారు. విశాలాక్షి 16 సం|| అందకత్తె. యవ్వనానికీ దారిద్ర్యానికీ కదన రంగమైన శరీరం. ఇద్దరు మగపిల్లలు 13-10 వయసు)

చల:—ఏమోయి నాయకుడూ! ఇప్పుడు వచ్చేవేమిటి? అమ్మవారి పండుగలకి వస్తే మీయగ్గొల్ల భాగవతం కట్టించి వుందును. మీరు వీణ విద్య కూడా చేస్తారా యేమిటి? శంభయ్య అని ఒక విప్రవినోది వుండే వాడోయ్

వల్ల:—నమస్కారం బాబూ! తమరు హేళన చేస్తే ప్రాణాలున్నట్లు లేచి పోతవి. 4 రోజుల నుంచీ అన్నం లేదు. అట్టే మాటాడ లేను.

చల:—అయితే వేగం కానీ. నాకు వారసు లెవరు? నువ్వా- ఈ పిల్లా?

వల్ల:—నా తలకాయ నే నేమిటి? నేను దేముడికే వారసుణ్ణి- ఈ పిల్లలే.

చల:—పిల్లే? బాగానే వుంది. ఇది నాకు వారసురాలైతే సంతోషిస్తాను. అమ్మాయీ! ఇటురా!

(విశాలాక్షి దగ్గరకు వస్తుంది)

నన్ను పెళ్లాడతావు? ఏమి తల వంచేశా వప్పుడే నీకు పెళ్లయిందా? అయితే యెందరు పిల్లలు నీకు?

వల్ల:—చిన్న పిల్ల- హాస్యమాడకండి- చిన్న బుచ్చుకొంటుంది.

చల:—వెళ్లు వెళ్లు. ఇదో వేషంగానూ వేలంబంగానూ వుంది ప్రతీవాళ్లకీ ఏమిటండీ యిది? వెధవ వాలకం ప్రతీ గాడిదా-

వల్ల:—నా పేరు వల్లభరావండి. జ్ఞాపకముందా- వైణికుణ్ణి- 18 ఏళ్లయి పోయింది-

చల:—ఆఁఆఁ! నువ్వా నువ్వా!

వల్ల:—చిత్తం. వీరు పార్వతి బిడ్డలండి.

చల:—వీళ్లా? వీళ్లా? నే నేలాగు నమ్మేది? ఏలాగు నమ్మక పోయేది? ఏం దారి?

వల్ల:—తమరు క్షమించి సెలవిస్తే యిందుకు తగిన సాక్ష్యం చూపిస్తాను.

చల:—అదే నిజమైతే యింక కావలసిన దేమిటి?

(వల్లభరావు వెళ్తాడు)

విశా:—ఆ స్త్రీ గారూ! ఇప్పుడు ఎక్కడికి పోయినారు- ఏమిటి సంగతి?

చల:—ఇదో అవాంతర గాథ. నాకు పార్వతి అని ఒక కుమార్తె వుండేది. ఆమెకు బాగా జ్ఞానం వచ్చిన తర్వాత పెండ్లి చేయ వలెననీ. ఈలోపున సంగీతసాహిత్యములు బాగా నేర్పించ వలెననీ నిశ్చయించి 18 ఏళ్ల దాకా పెంచుకొని వచ్చినాను. వల్లభరావనే అతడు వీణ చెప్పేవాడు. ఒక నాడంతట ఆమే అతడూ కనబడ లేదు. ఎంత వెతకించినా కనబడ లేదు. ఆ తలవంపు భరించలేక గుంటూరు నుంచి మకాం ఎత్తి వేసి ఈ గ్రామం వచ్చి వేసినాను. ఆ నడుమ ఆరేళ్ల క్రిందట ఆమె చనిపోయినట్లు జాబు వచ్చింది. ఒక్క రోగం పెట్టి వేసి వూరకున్నాను. ఇప్పుడితడు వచ్చి యీబిడ్డలు పార్వతి బిడ్డలని చెప్తాడు.

(వల్లభరావు- ఒక స్త్రీ- 3 బిడ్డలతో వస్తాడు. ఆమె 31 సం|| దరిద్ర దేవతా అంటే ఓ అంటుంది. బిడ్డలు 7 సం|| కూతురు; 4-1 సం|| కొడుకులు)

పార్వ:—నాన్నగారూ! రక్షించండి. చేసిన తప్పునకు చాలా అనుభవించి నాను. నా పాపం ఈజన్మలోనే తీర పోయింది. నీ పాలికాపు వాళ్లు ఆరుగురున్నారు. వీళ్లని పోషించండి నాన్నగారూ. దిక్కు లేదు. కడుపు నిండా అన్న మెరుగరు...

చల:—ఎవరు? ఎవరది? మా పార్వతే! మా బంగారు బొమ్మే! ఏమమ్మా! నీకీ గతివచ్చిందా? అయ్యో తల్లీ అయ్యో తల్లీ! ఇక్కడి కప్పుడే వచ్చి వేయ లేక పోతివా? ఒక వుత్తరం వెయ్య లేక పోయి నావా? ఆలాగు త్తరం వెయ్య లేక పోయినావా? ఆలాగు త్తరం వ్రాసే వేమయ్యా?

వల్ల:—మీ స్నేహితులొకరికి మేము కబడ్డాము. వారు మీకెక్కడ చెప్తారో వారు మమ్మేమి చేయిస్తారో అని భయపడి ఆలాగు వ్రాసినాను. ఎందుకవన్నీ- ఒక వెయ్యి తప్పులు చేసినాను. క్షమించండి. ఆ ఆంధ్ర పత్రిక కాగితం చూచి- వెంటనే-

చల:—ఇప్పుడైనా నా పార్వతిని నా కంట చేటినావు. నా కూతురు నాకు కనబడ్డది. నా బిడ్డ- నా బిడ్డకు బిడ్డలు! ఆరుగురు! ఓ- ఓ- ఓ- నాకింక వారసుల భయం లేదు. రండోయి రండి! అందరూ ఒక్క సారి నా దగ్గరకు రండి.

(అందరూ చుట్టుకొంటారు)

కలె:—ఇంతా బుచ్చిపంతులు చేసిన మేలు- పత్రికల వల్ల లోకానికి జరుగుతూ వున్న వుపకారమున్నూ.


## జాతకము, ప్రశ్న

మీ జాతక చక్రముయొక్క నకలుగాని, పుట్టిన తేది జనన కాల ఘడియలుగాని, ఉత్తరము వ్రాయు కాలము వయస్సుగాని, రెండు అరచేతి ముద్రలు గాని పంపినచో జాతకునియొక్క రూప లక్షణములు, ధనము, విద్య, భూమి, సంతానము, కళత్రము, ఉద్యోగము, జీవనము మొదలగు 25 అంశములున్ను, వర్తమాన ఫలమున్ను వ్రాయుటకు రూ. 2-0-0 1 సం॥ర ఫలము క్యారెక్టరు రీడింగుతో నెలల వారీగా వ్రాయుటకు రూ. 1-0-0 మీ యిష్టము వచ్చిన అయిదు ప్రశ్నలకు రూ. 1-0-0.

వి. పి. గా పంపుదుము, పోష్టు ఖర్చులు వేరు.

పురాతన జ్యోతిష గ్రంథములు

| | | | | | |
|---|---|---|---|---|---|
| గౌతమ సంహిత | ... | వెల రూ. | 0 | 8 | 0 |
| వాంచానాథీయము | ... | ,, | 0 | 8 | 0 |
| జాతక రాజీయము | ... | ,, | 1 | 0 | 0 |

పోష్టు ఖర్చులు వేరు.

యీ మూడున్ను తాళ పత్రములనుండి యెత్తి వ్రాసి తెలుగు తాత్పర్యముతో సహా అచ్చొత్తించి యున్నాము. జ్యోతిషములో యిటువంటి గ్రంథములు యిదివరలో అచ్చుపడి యుండలేదని మీరే చదువుట వలన గ్రహించ గలరు.

కొంపెల్ల నరసింహ్వా శాస్త్రి.

ప్రొప్రయిటరు, శాస్త్రి జ్యోతిషాలయము

తుని, తూర్పు గోదావరి జిల్లా.



## ఇలాంటిది యిదివరకు జరగ లేదు, విని అయినా వుండరు

మా ఒట్టో రోజ్ లేక హైన అనే దాని సువాసన చాలా యింపుగావుండి మెదడిని చల్లబరుస్తుంది. దాన్ని అందరూ వుపయోగించవలెననే వుద్దేశముతో ఒట్టో రోజ్ డజను సీసాలు రు. 1-15-0లకు కొనే అందరికీ - ఒక చేతికి కట్టుకొనే గడియారమూ, గొలుసుతో సహా ఒక చిన్న జేబుగడియారమూ ఒక నిజమయిన బి. టయిం. పీసూ (గడియారము) ౧౦ సంవత్సరములు గ్యారంటి తోనూ, ఒక మాయ ముత్యాలహారమూ యిస్తాము. తపాలా ఖర్చులు వగయిరా ప్రత్యేకము - సంతృప్తి కలగక పోతే డబ్బు వాపసు యిస్తాము.

**THE TRADING CORPORATION,**

**10-A, Jorabagan, Calcutta**



## ఉచితం

పోష్టు ఖర్చులతో సహా ఉచితం

మీ, మీ వూళ్లల్లోవున్న స్టేషనరీ దుకాణదార్లు - పుస్తకాల దుకాణదార్ల పేర్లు పచారీ దుకాణదార్ల పేర్లు అయినా పేర్లు మాకు తెలియజేసినట్లయితే యీక్రింది బొమ్మలు అర డజను ఉచితంగా పంపుతాము.

1. శ్రీ సరోజినిదేవి
2. శ్రీ కమలాదేవి (చట్టోపాధ్యాయ)
3. జవహర్‌లాల్ నెహ్రూ
4. శివాజి
5. మహాత్మగాంధి (మందహాసముతో నమస్కారము పెడుతున్నట్లున్నది)
6. వివేకనందస్వామి

ఇవన్నీ చక్కని ముద్దులు మూటగట్టే త్రివర్ణ చిత్రములు. ప్రతివారి యిల్లూ వీట్లతో అలంకరించుకొన తగినవి.

## ది ఓరియంటల్ బుక్ డిపో

మద్రాసు